పరిష్కారంలో జాప్యం వద్దు


సమస్యలు వింటున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: సమీకృత పాలనా ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రాధాన్య క్రమంలో ప్రజావాణి సమస్యలు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. శాఖల వారీగా దరఖాస్తులు పెండింగ్ లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు పాలనాధికారులు అరుణశ్రీ, శ్యాంప్రసాద్‌లాల్ పాల్గొన్నారు.

త్వరితగతిన క్రమబద్ధీకరించాలి

పెద్దపల్లి కలెక్టరేట్: పెండింగ్ ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన క్రమబద్ధీకరించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం రెవెన్యూ, నీటిపారుదల, పట్టణ ప్రణాళికా అధికారులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. అదనపు పాలనాధికారి అరుణశ్రీ, జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శుల బదిలీ

ముత్తారం: ముత్తారం మండలంలోని పలు గ్రామాల కార్యదర్శులను బదిలీ చేసినట్లు ఎంపీడీవో సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మల్లీశ్వరీ (పారుపల్లి కార్యదర్శి)ని అడవిశ్రీరాంపూర్‌కు.. రవీందర్ (ఓడేడు)ను పారుపల్లికి.. సంధ్యారాణి (దర్యాపూర్)ని ఓడేడుకు.. భద్రు (మైదంబండ)ను ఖమ్మంపల్లికి.. జైపాల్ (పోతారం)ను మైదంబండకు.. నవ్య (హరిపురం)ను పోతారానికి.. నరేశ్ (పోతారం)ను ముత్తారానికి బదిలీ చేసినట్లు ఎంపీడీవో పేర్కొన్నారు. రాజేందర్‌కు కేశనపల్లి, జైపాల్‌కు లక్కారం గ్రామాల అదనపు బాధ్యతలను అప్పగించారు.

క్రమబద్ధీకరణలో నిర్లక్ష్యం.. కారణాలనేకం!

‘నాలుగేళ్ల నుంచి లక్షలమంది లేఅవుట్ల క్రమబద్ధీకరణ(ఎల్ఆర్ఎస్)కు ఎదురుచూస్తున్నారు. దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ చురుగ్గా సాగడం లేదు. కలెక్టర్లు ఉదాసీనంగా ఉండటం సరికాదు. వెంటనే దృష్టి సారించాలి’

ఈ నెల 1న జిల్లా పాలనాధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు.

న్యూస్‌టుడే, గోదావరిఖని పట్టణం

నాలుగేళ్ల క్రితం నిర్ణీత గడువులోగా జిల్లాలోని పట్టణాల్లో 19,178.. గ్రామీణ ప్రాంతాల్లో 6,273 దరఖాస్తులురాగా వాటి పరిష్కారం నత్తనడకన సాగుతుంది. ప్రస్తుతం మంత్రి ఆదేశాల మేరకు.. ఆయా దరఖాస్తులను పరిశీలించి ఎప్పటికప్పుడు ఆయా దరఖాస్తుదారులకు స్వయంగా ఫోన్ చేసి నిర్ణీత రుసుం చెల్లించి సంబంధిత స్థలాన్ని క్రమబద్ధీకరించుకోవాలని అధికారులు కోరుతున్నా.. స్పందన నామమాత్రంగానే ఉంటుంది.

చెల్లింపునకు వెనుకంజ

● అన్ని దస్త్రాలు సవ్యంగా ఉన్నప్పటికీ నిర్ణీత రుసుం చెల్లించలేక స్థలాలను క్రమబద్ధీకరించుకోలేనివారు కొందరైతే.. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రక్రియ నాలుగేళ్ల క్రితం నాటిది. గడిచిన సమయంలో ఇప్పటికే సంబంధిత స్థలం ఇద్దరు, ముగ్గురి చేతులు మారడం(క్రయ, విక్రయాలు)తో మొదట దరఖాస్తు చేసుకున్న వ్యక్తి.. ఇప్పుడా స్థలం యజమాని కాకపోవడంతో స్పందించడం లేదు.

● అత్యధిక దరఖాస్తులు వివిధ కారణాలతో ఎల్ఆర్ఎస్ పరిధిలోకి రాకుండా నిషేధిత జాబితాలో చేరాయి. దరఖాస్తుదారులు సంబంధిత శాఖాధికారులను సంప్రదించి ఆయా స్థలం.. నిషేధిత జాబితాలో లేనట్లుగా నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం సమర్పిస్తే క్రమబద్ధీకరణ ప్రక్రియ పూర్తికానుంది. ఇప్పటికే కొందరు జరిమానాతో రుసుం చెల్లించి ప్రభుత్వ అనుమతి తీసుకొని భవనాలు నిర్మించుకున్నారు. నాలుగేళ్ల క్రితం వీరు సమర్పించిన దరఖాస్తులు ఇప్పుడు పెండింగ్ జాబితాలో ఉన్నాయి. అప్పుడు హడావుడిగా కేవలం రూ.1000 చెల్లించి దరఖాస్తు చేసినవారు.. ప్రస్తుతం నిర్ణీత రుసుం చెల్లించేందుకు వెనుకంజ వేస్తున్నారు.

వేగవంతానికి ప్రభుత్వం చర్యలు

ప్రత్యేక మొబైల్ యాప్..

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేసేందుకు ప్రత్యేకంగా మొబైల్ యాప్‌ను రూపొందించారు. దీనిలో భాగంగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, నీటిపారుదలశాఖ ఏఈ, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులకు ప్రత్యేకంగా దరఖాస్తుల ప్రక్రియలో లాగిన్ సదుపాయం కల్పించారు.



ప్రక్రియ వేగవంతం చేస్తున్నాం..

- మనోహర్, కమిషనర్, మంథని మున్సిపాలిటీ

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను వేగవంతం చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ఎప్పటికప్పుడు ఆయా శాఖల అధికారుల సమన్వయంతో ముందుకు సాగుతున్నాం. మరోవైపు దరఖాస్తుదారుల్లో అవగాహన పెంచేందుకు కృషి చేస్తున్నాం. ఆమోదం పొందిన దరఖాస్తుదారులను నిర్ణీత రుసుం చెల్లించాల్సిందిగా కోరుతున్నాం.

ఈనెల 7 నాటికి జిల్లాలోని ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన తీరు..

విభాగం	మొత్తం	పరిశీలించినవి	ఆమోదించినవి	తిరస్కరించినవి	నిర్ణీతదస్త్రాలు లేనివి	పరిశీలన శాతం
పట్టణ ప్రణాళిక	17,719	4,961	2,720	1,771	484	28.00
రెవెన్యూ	‘ ’	2,141	2,072	60	09	12.08
నీటి పారుదల శాఖ	‘ ’	1,591	1,526	31	34	8.98

మత్స్యకారుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం


చెరువులో చేపపిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ ఛైర్మన్ సాయికుమార్

మంథని, న్యూస్‌టుడే: రాష్ట్రంలో మత్స్యకార కుటుంబాల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ ఛైర్మన్ సాయికుమార్ తెలిపారు. సోమవారం మంథని తమ్మిచెరువులో ఉచిత చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని జిల్లాల్లో చేప పిల్లల పంపిణీ కార్యక్రమం జరుగుతోందని.. మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని వివరించారు. చేపల పెంపకంతో వ్యవసాయ అనుబంధ రంగాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ప్రతీ చెరువులో మూడు రకాల చేప పిల్లలు విడుదల చేస్తున్నట్లు చెప్పారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ రమాదేవి, సింగిల్‌విండో అధ్యక్షుడు శ్రీనివాస్, వైస్ ఛైర్మన్ బానయ్య, కౌన్సిలర్లు సమ్మయ్య, హనుమంతు, నాగేంద్ర మత్స్య సహకార సంఘం జిల్లా డైరెక్టర్ క్రాంతికుమార్, జిల్లా మత్స్యశాఖ అధికారి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తి(రామగుండం): రామగుండం పట్టణంలోని పెద్దచెరువు వద్ద రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉచిత చేపపిల్లల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ ఛైర్మన్ సాయికుమార్‌లు ముఖ్య అతిథిగా హాజరై చేప పిల్లల్ని వదిలినంతరం మాట్లాడారు. మత్స్య విభాగం అధికారులు డీడీ ఖాదీర్, జిల్లా మత్స్యశాఖ అధికారి భాస్కర్, నర్సయ్య, సారయ్య, సుజాత, శ్రీకాంత్, ఫీల్డ్ అధికారులు, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



కొత్త గురువులు వస్తున్నారు

డీఎస్సీలో ఎంపికైన వారికి రేపు నియామక పత్రాలు

న్యూస్‌టుడే-కరీంనగర్ విద్యావిభాగం


కరీంనగర్‌లో డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన

ఉమ్మడి జిల్లాలో కొంతమేర బోధన ఇబ్బందులు తొలగనున్నాయి. 2024 డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ తుది దశకు చేరుకుంది. డీఎస్సీలో మెరిట్ సాధించిన అభ్యర్థులను 1:3 పద్ధతిలో ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు పిలిచి ఈ కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖలు పూర్తి చేశాయి. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు బుధవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియామక పత్రాలను అందించనున్నారు. మరో వైపు వారి నియామకాలకు సంబంధించిన ఖాళీల వివరాలను సేకరించి వాటిని ప్రకటించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు సిద్ధమయ్యారు.

ప్రాథమిక పాఠశాలలకు ఊరట..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల సమస్య వేధిస్తోంది. ఇటీవల పదోన్నతులు, బదిలీలను ప్రభుత్వం చేపట్టిన అనంతరం ఎస్జీటీల కొరత తీవ్రంగా ఉంది. చాలామందికి పదోన్నతులు రావడం ఇందుకు కారణం. బదిలీ పొందిన పలువురు ఉపాధ్యాయులు రిలీవర్ లేని కారణంగా అదే పాఠశాలల్లో పని చేస్తున్నారు. డీఎస్సీ ప్రకటన వెలువడిన అనంతరం ఎస్జీటీలకు పదోన్నతులు కల్పించడం, బదిలీ చేయడంతో పెద్ద సంఖ్యలో ఖాళీలు ఏర్పడ్డాయి. ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత కొంతమేరకు ఉంటుంది. ప్రస్తుతం డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల నియామకాలు జరుగుతుండటంతో ఈ సమస్య తీరనుంది. ముఖ్యంగా ప్రాథమిక పాఠశాలల్లో ఎస్జీటీల కొరతకు కొంత ఊరట లభించనుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వారి నియామకాలు జరిగినా ఇంకా ఎస్జీటీల కొరత పలు పాఠశాలలను వేధించనుంది. జగిత్యాల జిల్లాలో 441, కరీంనగర్‌లో 311, పెద్దపల్లిలో 158, రాజన్న సిరిసిల్లలో 231 ఎస్జీటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

జిల్లాల వారీగా నియామక పోస్టుల వివరాలు..

విభాగం	జగిత్యాల	కరీంనగర్	పెద్దపల్లి	రాజన్న సిరిసిల్ల
స్కూల్ అసిస్టెంట్	99	86	49	56
భాషా పండితులు	39	18	5	12
పీఈటీలు	8	7	1	4
ఎస్జీటీలు	161	114	21	67
స్పెషల్ ఎడ్యుకేటర్(ఎస్ఏ)	5	5	5	3
ఎస్జీటీ	22	15	12	9
మొత్తం	334	245	93	151

పౌర సేవల్లో జాప్యమేల?

ఇన్‌ఛార్జి అధికారుల పాలనలో పురపాలికలు

న్యూస్‌టుడే, పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని



పురపాలికల్లో వివిధ పౌరసేవలను నిర్ణీత గడువులోగా అందించాల్సి ఉంటుంది కానీ.. గత నెలరోజులుగా జిల్లాలోని వివిధ పురపాలికలు ఇన్‌ఛార్జి అధికారులు ఏలుబడిలో ఉండటంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. వివిధ కారణాలతో వెళ్లిపోయినా.. అధికారుల స్థానంలో కొత్తవారి నియామకం జరగకపోవడంతో ఇన్‌ఛార్జిలే పరిపాలన సాగిస్తున్నారు.

ఇదీ పరిస్థితి

● రామగుండం నగరపాలిక కమిషనర్‌గా జిల్లా అదనపు పాలానాధికారి అరుణశ్రీ, మంథని కమిషనర్‌గా పురపాలిక సూపరింటెండెంట్ మనోహర్, సుల్తానాబాద్ పురపాలిక ఇన్‌ఛార్జి కమిషనర్‌గా పెద్దపల్లి కమిషనర్ వెంకటేశ్ వ్యవహరిస్తున్నారు.

● వారం క్రితం ఇన్‌ఛార్జి అధికారులకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించడంతో అత్యవసర సేవలు అందుబాటులోకి వచ్చాయి కానీ.. పౌరసేవలు మాత్రం పూర్తిస్థాయిలో అందడం లేదు.

● పెద్దపల్లి పురపాలికలో వివిధ అంశాలపై నిత్యం 40 నుంచి 50 దరఖాస్తులను అధికారులు స్వీకరిస్తున్నారు.

● జనన, మరణ ధ్రువీకరణలతోపాటు పేరు మార్పిడి, ఇంటి అనుమతులు తదితర సమస్యలు అపరిష్కృతంగానే ఉంటున్నాయి.

● సుల్తానాబాద్ పురపాలిక కమిషనర్ రెండు నెలలుగా లేకపోవడంతో కార్మికులకు వేతనాలు ఇచ్చే పరిస్థితి లేకుండా పోయింది.

● వారం క్రితం పెద్దపల్లి కమిషనర్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించడంతో కార్మికులకు వేతనాలు చెల్లించడంతోపాటు అత్యవసర సేవలు అందుబాటులోకి వచ్చాయి.

● రెండు నెలలుగా జనన, మరణ ధ్రువీకరణల కోసం 87 దరఖాస్తులు రాగా వాటిలో నిర్ణీత గడువు దాటిన తరువాత కూడా 25 దరఖాస్తులు పరిష్కారానికి నోచుకోలేదు.

● మంథని పురపాలిక కమిషనర్ గత నెలలో సరెండర్ కావడంతో ఇన్‌ఛార్జి కమిషనర్‌గా మున్సిపల్ సూపరింటెండెంట్ వ్యవహరిస్తున్నారు. ఆయనకు వారం క్రితం పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించడంతో పౌరసేవల్లో కొంత వేగం పుంజుకుంది.

● జనన, మరణ ధ్రువీకరణలతోపాటు ఇంటి పన్ను సంబంధిత సమస్యలపై 106 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. దసరా తరువాత దరఖాస్తుల పరిష్కారం పూర్తి చేస్తామని కమిషనర్ మనోహర్ తెలిపారు.


ఎన్టీపీసీలో...


మేడిపల్లి రోడ్డులో...



గోదావరిఖని స్వతంత్రచౌక్‌లో...

ఆలయాలను తలపించేలా!

దేవీనవరాత్రోత్సవాల్లో భాగంగా రామగుండం నగరపాలక ప్రాంతంలోని వివిధ కాలనీల్లో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపాలు ఆలయాలను తలపిస్తున్నాయి. గాలిగోపురం మాదిరిగా మండపాల స్వాగత తోరణాలను, లోపల పురాతన ఆలయ నిర్మాణాల వలే ఆధ్యాత్మిక భావన కల్గించే రీతిలో ఏర్పాటు చేశారు. విశేష అలంకరణ కోసమే ఒక్కొక్క మండపానికి రూ.లక్షకు పైగా ఖర్చు చేసినట్లు నిర్వాహకులు చెప్పారు.

- న్యూస్‌టుడే, గోదావరిఖని పట్టణం

పొంచి ఉన్న ప్రమాదం



రోడ్ల పక్కనే ఉన్న బావులు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. కమాన్‌పూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని దాసరిపల్లికి వెళ్లే దారిలో వ్యవసాయబావి ఇది. ప్రమాదకరంగా ఉన్నా.. బావి కనిపించకుండా పిచ్చిమొక్కలు కమ్ముకున్నాయి. సంబంధిత అధికారులు రక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, కమాన్‌పూర్

సాగు సర్వేకు ఆటంకాలు!


ఈనాడు, పెద్దపల్లి


కమాన్‌పూర్ మండలంలో సర్వే చేస్తున్న వ్యవసాయ విస్తరణాధికారి (పాత చిత్రం)

పంటల సర్వే తాము చేయలేమంటూ వ్యవసాయ విస్తరణాధికారులు (ఏఈవోలు) స్పష్టం చేయడంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రక్రియ ఆగిపోయింది.. దేశవ్యాప్తంగా ఆహారభద్రత, పంటల బీమాతోపాటు ప్రకృతి వైపరీత్యాల వల్ల జరిగే పంట నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానంగా పంటల సర్వే చేయాలని నిర్ణయించింది.. సాగులో ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవడంలో భాగంగా ఈ సర్వేను దేశవ్యాప్తంగా నిర్వహిస్తోంది.. తమకున్న విధులతోపాటు ఈ సర్వే భారం మోయలేకపోతున్నామని ఏఈవోలు పేర్కొంటుండటంతో సర్వే నిలిచిపోయింది.

● ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా 257 మంది ఏఈవోలకు పంటల సర్వేను అప్పగించారు. ఈ వానాకాలంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం సాధారణ పంటలు, ఉద్యాన పంటలు కలిపి 10,80,512 ఎకరాల్లో సాగు చేశారు. ఈ క్రమంలో ఉన్న 257 మంది ఏఈవోలు ఇన్ని లక్షల ఎకరాల్లో పంట సర్వే చేయడం కష్టంగా మారింది. రాష్ట్రవ్యాప్తంగా ఇదే సమస్యలుండటంతో ఏఈవోలందరూ మూకుమ్మడిగా తమ జిల్లాల్లో కలెక్టర్లకు తాము సర్వే చేయమని లిఖితపూర్వక వినతి పత్రాన్ని అందించారు.

● సర్వేలో భాగంగా ఏఈవోలు తమ పరిధిలోని ప్రతి రైతు పొలం వద్దకు వెళ్లాల్సి ఉంటుంది. తమ దగ్గరున్న ట్యాబ్‌లో రైతు పేరు, పొలం విస్తీర్ణం, ఎంత విస్తీర్ణంలో సాగు చేశారు, ఏయే పంటలు వేశారు. పూర్తి వివరాలు నమోదు చేయడంతోపాటు రైతుతో స్వీయచిత్రం కూడా తీసుకోవాల్సి ఉంటుంది.



● ఏఈవోలు వ్యవసాయ శాఖ పరిధిలోని 49 రకాల సేవలను రైతులకు అందేలా గ్రామాల్లో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. పంటల యాజమాన్యంపై సలహాలు, సూచనలు ఇవ్వడం, ప్రభుత్వ పరంగా వచ్చే రాయితీలు, సాయాలు సరిగా అందకుంటే వాటిపై దృష్టి పెట్టడం తదితర పనులతో తీరికలేకుండా ఉంటున్నామని వాపోతున్నారు. ధాన్యం కొనుగోళ్ల సమయంలోనూ ఎక్కువ సమయం వెచ్చించాల్సి వస్తోందని, ఈ బాధ్యతలకు తోడుగా ప్రభుత్వం డిజిటల్ సర్వే కూడా చేపట్టాలని ఆదేశాలు జారీ చేయడంతో తమకు ఇబ్బందిగా ఉందని చెబుతున్నారు. పంటల సాగు విస్తీర్ణాన్ని బట్టి తమకు సహాయక సిబ్బందిని నియమిస్తే సర్వే చేస్తామని పేర్కొంటున్నారు.

● ఈ విషయమై పెద్దపల్లి జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఆదిరెడ్డితో మాట్లాడగా సర్వే కోసం పొలాల వద్దకు వెళ్లి వివరాలు నమోదు చేయాల్సి ఉండటంతో ఏఈవోలకు విధుల సమన్వయం ఇబ్బందిగా మారిందని చెప్పారు. ఏఈవోలందరూ రాష్ట్రవ్యాప్తంగా ఈ అంశాలన్నింటిని ప్రస్తావిస్తూ వ్యవసాయశాఖకు నివేదించారని, తదుపరి ఉత్తర్వులు వచ్చిన తర్వాత పంటల డిజిటల్ సర్వే ప్రక్రియ కొనసాగిస్తామన్నారు.

డిమాండ్లు పరిష్కరించాలని ధర్నా


నినాదాలు చేస్తున్న కార్మికులు

పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: సమీకృత పాలనా ప్రాంగణం ఎదుట తెలంగాణ గ్రామ పంచాయతీ యూనియన్, వర్కర్స్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో కార్మికులు సోమవారం ధర్నా నిర్వహించారు. వేతన బకాయిల విడుదల, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వేతనాలు లేకపోవడంతో పండగ పూట పస్తులుండే పరిస్థితి నెలకొందని ఆరోపించారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతి పత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు రవీందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఖాజా, లచ్చయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతేరాజు 9లో


మూలసాలలో క్రీడా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృంద సభ్యులు

కేంద్ర బృందం పర్యటన

పెద్దపల్లి, న్యూస్‌టుడే: పెద్దపల్లి మండలంలోని మూలసాల, రాగినేడు గ్రామాల్లో కేంద్ర బృంద సభ్యులు సోమవారం పర్యటించారు. కేంద్రం ప్రభుత్వ పథకాల అమలు తీరును అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన వివిధ పనులపై ఆరా తీశారు. పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలు, గ్రామీణ క్రీడా ప్రాంగణాలు, పూడిక తీసిన ఎస్సారెస్పీ పంట కాలువలను అధికారులు పరిశీలించారు. పెన్షన్లు, పీఎంఎఫ్ఎం ద్వారా ప్రయోజనం పొందిన వారితో మాట్లాడారు. గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్ర బృంద సభ్యులు బాలమురళి, సునీల్, ఎంపీడీవో శ్రీధర్, ఎంపీవో ఫయాజ్ తదితరులున్నారు.

న్యూస్‌టుడే, కమాన్‌పూర్ (సెంటినరీకాలనీ)

? కల్వచర్ల పరిధిలోని ప్రగతి పాఠశాల వైపు వెళ్లే దారి పక్కన ఉన్న కాలువ వెంబడి పిచ్చిమొక్కలు పెరిగాయి. - స్థానికులు

✔ చెత్తాచెదారంతోపాటు పిచ్చి మొక్కలను తొలగింపజేస్తాం. - సీహెచ్ శ్రీధర్, కార్యదర్శి


సుల్తానాబాద్‌లో సీసీ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విజయ రమణారావు

పట్టణాభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే

సుల్తానాబాద్, న్యూస్‌టుడే: సుల్తానాబాద్ పట్టణంలోని అన్నివార్డుల్లో సీసీ రహదారులు, మురుగు కాల్వలు నిర్మించి.. ప్రధాన కూడళ్ల సుందరీకరణ పనులు చేసి పట్టణాభివృద్ధికి కృషి చేయనున్నట్లు ఎమ్మెల్యే విజయ రమణ రావు తెలిపారు. టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.2.29 కోట్లతో పలు వార్డుల్లో నిర్మించనున్న సీసీ రహదారి పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. పుర ఛైర్‌పర్సన్ గాజుల లక్ష్మి, పీఏసీఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లి: పురపాలిక పరిధిలోని రంగంపల్లిలో రెండు సీసీ రోడ్లకు ఎమ్మెల్యే సోమవారం భూమిపూజ నిర్వహించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ స్వరూప, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి కలెక్టర్ చేయూత

పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: ముత్తారం మండలం కాసర్లగడ్డకు చెందిన విలువిద్య క్రీడాకారిణి అర్చనకు కలెక్టర్ కోయ శ్రీహర్ష చేయూత అందించారు. ముత్తారం పర్యటనకు వెళ్లిన కలెక్టర్‌కు.. తనకు అర్చరీ కాంపౌండ్ బో కిట్ అందించాలని అర్చన విజ్ఞప్తి చేసింది. దీంతో రూ.1.25 లక్షలతో కిట్ కొనుగోలు చేసి సోమవారం పంపిణీ చేశారు. అర్చన గతేడాది జాతీయ స్థాయిలో ప్రతిభ చాటి బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నామని.. భవిష్యత్తులో అర్చన ఉన్నతంగా రాణించాలని కలెక్టర్ కాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడా, యువజన శాఖ అధికారి సురేశ్, వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.


కలెక్టరేట్‌లో అర్చన

కుటుంబ డిజిటల్ సర్వే ముమ్మరం చేయండి

పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: కుటుంబాల సంఖ్య నిర్ధారించేందుకు ప్రభుత్వం ప్రయోగాత్మకంగా చేపట్టిన ప్రాంతాల్లో కుటుంబ డిజిటల్ సర్వేలో వేగం పెంచాలని సీఎం ఓ.ఎస్.డి. వేముల శ్రీనివాస్ తెలిపారు. సమీకృత పాలనా ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎంపిక చేసిన ప్రాంతాల్లో 1,127 కుటుంబాలు ఉంటాయని భావించగా సర్వేలో 2,047గా తేలిందని వెల్లడించారు. కుటుంబ సభ్యుల ఫొటోలు లేకున్నప్పటికీ సర్వే పూర్తి చేయాలని సూచించారు. పొరపాట్లు లేకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ జిల్లాలో మూడు నియోజకవర్గాల్లో పకడ్బందీగా సర్వే చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో అదనపు పాలనాధికారి అరుణశ్రీ, జడ్పీ సీఈవో నరేందర్, డీపీవో వీరబుచ్చయ్య, ఆర్డీవో గంగయ్య పాల్గొన్నారు.

రెండు నెలలుగా పట్టింపు కరవు



మంథనిలోని బొక్కలవాగు ఆనకట్టపైన రెండు నెలల క్రితం కింద పడిన విద్యుత్తు స్తంభాన్ని నేటికి పునరుద్ధరించలేదు. దీంతో రహదారిపై వెళ్తున్న బాటసారులు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణ సుందరీకరణలో భాగంగా బొక్కలవాగు ఆనకట్టపై విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేశారు. కింద పడిన స్తంభాన్ని వెంటనే బిగించి దీపాలు ఏర్పాటు చేస్తామని ఇన్‌ఛార్జి కమిషనర్ మనోహర్ అన్నారు.
- న్యూస్‌టుడే, మంథని

అరకొరగా భగీరథ నీటి సరఫరా



కొచాపూర్‌లోని మొదటి వార్డులో మిషన్ భగీరథ నీరు సక్రమంగా అందడం లేదు. దాదాపు 10 కుటుంబాలకు నీరందక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి రేవతితో 'న్యూస్‌టుడే' మాట్లాడగా గ్రామంలో మొత్తం 12 వార్డులకు కలిపి కొత్తగా 21 నల్లాలు ఏర్పాటు చేస్తామన్నారు. మొదటి వార్డులోని 10 కుటుంబాలకు రెండు రోజులుగా మిషన్ భగీరథ నీటి సౌకర్యాన్ని అందిస్తున్నామని చెప్పారు. స్థానికంగా పైపులైన్ పనులు అసంపూర్తిగా ఉండటంతో సమస్య ఏర్పడిందని మిషన్ భగీరథ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయిప్రసాద్ తెలిపారు. ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్ఎం) నిధులు రూ.1.50 లక్షలతో పనులు ప్రారంభించామన్నారు. మూడు రోజుల్లో ప్రతి ఇంటికీ కుళాయిలు ఏర్పాటు చేసి తాగునీరు అందిస్తామన్నారు. ఏటా నాలుగైదు ఇళ్ల నిర్మాణాలు జరుతుండగా, పంచాయతీ నుంచి అనుమతి పొందిన వారికే మిషన్ భగీరథ నీటి సౌకర్యాన్ని కల్పిస్తామని చెప్పారు. - న్యూస్‌టుడే, జూలపల్లి

పాలస్తీనా మారణహోమంపై నిరసన

గోదావరిఖని: పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులను నిరసిస్తూ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో సోమవారం గోదావరిఖనిలో నిరసన తెలిపారు. స్థానిక కోర్టు చౌరస్తాలో పెద్దఎత్తున నినాదాలు చేశారు. నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లి కలెక్టరేట్: పాలస్తీనాపై దాడులు నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ పెద్దపల్లి బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట సీపీఐ నాయకులు సోమవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి గట్టయ్య ఎరవెల్లి ముత్యంరావు మాట్లాడుతూ.. దాడుల్లో వేలాది మంది మృతిచెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అశోక్, రవీందర్, శ్రావణ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



ఖని: నినాదాలు చేస్తున్న నాయకులు

బతుకమ్మ సంబరాలు


అమెరికాలో..

కాల్వశ్రీరాంపూర్, న్యూస్‌టుడే: కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద సోమవారం సిబ్బంది బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించారు. వైద్యులు మహేందర్, శ్రీనివాస్, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.


కాల్వశ్రీరాంపూర్ ఆసుపత్రిలో బతుకమ్మ ఆడుతున్న సిబ్బంది

మంథని గ్రామీణం: అమెరికాలో స్థిరపడిన మంథని పట్టణానికి చెందిన 30 కుటుంబాలవారు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రోజూ బతుకమ్మ సంబరాల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు.


యువ మేనేజర్లతో జీఎంలు

ముగిసిన శిక్షణ తరగతులు



యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి ఆర్జీ-2 డివిజన్‌లోని నర్‌గూవ్‌కర్ శిక్షణ కేంద్రంలో. . 29మంది యువ మేనేజర్లకు గతనెల ప్రారంభమైన శిక్షణ తరగతులు సోమవారం ముగిసాయి. 21 రోజులపాటు శిక్షణ తరగతుల్లో నేర్చుకున్న అంశాలపై.. జీఎంలు రవికుమార్, కృష్ణయ్య, సూర్యనారాయణలు వారికి మౌఖిక పరీక్ష నిర్వహించారు. రాబోయే రోజుల్లో గనుల్లో వివిధ పనులు నిర్వహించేలా సన్నద్ధం కావాలని సూచించారు.

పది పడకలతో బ్లాకు ప్రారంభం

యైటింక్లయిన్‌కాలనీ: కాలనీలోని సెక్టార్-3 డిస్పెన్సరీలో ఏర్పాటుచేసిన క్యాజువాలిటీ బ్లాకును సోమవారం జీఎం సూర్యనారాయణ ప్రారంభించారు. 10 పడకలతో ఏర్పాటుచేసిన ఈ బ్లాకు అనారోగ్యంతోపాటూ ఇతర సమస్యలతో ఇబ్బందిపడే సింగరేణి కార్మికులకు వారి కుటుంబసభ్యులకు ఉపయోగపడుతుందన్నారు. ఆయన వెంట ఏసీఎంవో డాక్టర్ కిరణ్‌రాజ్‌కుమార్, మెడికల్ సూపరిండెంట్ డాక్టర్ మహిపాల్‌తోపాటూ ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

రక్షణ చర్యలపై సంతృప్తి

యైటింక్లయిన్ కాలనీ: సింగరేణి ఆర్జీ-2 డివిజన్‌లోని వకీల్‌పల్లి గనిని సోమవారం భారత బొగ్గు గనుల భద్రత విభాగం అధికారి రాజీవ్ ఓంప్రకాశ్ సందర్శించారు. గనికి చేరుకున్న ఆయనకు అధికారులు స్వాగతం పలికారు. అనంతరం గనిలోకి దిగిన డీఎంఎస్.. బొగ్గు ఉత్పత్తిలో కీలకమైన కంటిన్యూస్‌మైనర్, ఎల్‌హెచ్‌డీ పని స్థలాలు తనిఖీచేశారు. అధికారులు పని ప్రదేశాల్లో తీసుకుంటున్న రక్షణ చర్యలపై సంతృప్తి వ్యక్తం చేశారు.


గని ప్రణాళిక పటాన్ని పరిశీలిస్తున్న ఓంప్రకాష్‌వర్మ


గోదావరిఖని: ప్రత్యేకాలంకరణలో దుర్గాదేవి అమ్మవారు


ఖని: అమ్మవారి బోనంతో ఎమ్మెల్యే సతీమణి మనాలిఠాకూర్


నందిమేడారంలో దీక్షాపరుల మొక్కులు


సుల్తానాబాద్: పూసాలలో..


పొట్యాలలో చండీయాగంలో పాల్గొన్న గ్రామస్థులు

కుంకుమ పూజలు.. అన్నప్రసాదాలు

జిల్లాలో వివిధ గ్రామాల్లో శ్రీదుర్గాభవానీ శరన్నవ రాత్రోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. దుర్గాభవానీ సన్నిధిలో సోమవారం కుంకుమ పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం అన్నదానాలు నిర్వహించారు. కమాన్‌పూర్‌లోని ఛత్రపతి శివాజీ యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉత్సవాల సందర్భంగా యువసేన ప్రథమ అధ్యక్షుడు గన్నవరపు రవి-శ్రీలేఖ దంపతులు సిరా ప్రసాదంతో దశాబ్ది ఉత్సవ ప్రాముఖ్యాన్ని తెలియజేస్తూ పళ్లెంపై అమ్మవారి చిత్రాన్ని రూపొందించి ప్రదర్శించారు.
- న్యూస్‌టుడే యంత్రాంగం

శివసత్తుల ఆట.. అమ్మవారి బాట


నాగేపల్లిలో అమ్మవారి వద్ద శివసత్తులు, పోతురాజులు

కమాన్‌పూర్ (సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: రామగిరి మండలం నాగేపల్లిలో దుర్గాదేవి బోనాలను సోమవారం వైభవంగా నిర్వహించారు. శివసత్తులు, పోతురాజులు బోనాలను గ్రామంలో ఊరేగించారు. మహిళల కోలాటాలు, పాటలు, నృత్యాలు నడుమ సంబరంగా నిర్వహించారు. గ్రామస్థులు, మహిళలు, పాల్గొన్నారు.

సంక్షిప్తం

■ రాష్ట్ర పోటీల్లో ద్వితీయ బహుమతి

మార్కండేయకాలనీ: ఆర్ఎఫ్‌సీఎల్‌లోని శ్రీచైతన్య ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు సంతోష్.. రాష్ట్ర స్థాయి పాటల పోటీల్లో ద్వితీయ స్థానం సాధించి బహుమతి పొందారు. విజయ దశమి 2024 పురస్కారాల సందర్భంగా గోదావరిఖనిలో బిట్ అకాడమి, దేవా కళా బృందం సంయుక్తంగా రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించింది. నటి వర్షిణి, ఎన్‌సీపీ జిల్లా అధ్యక్షులు శ్రీధర్‌యాదవ్‌లు జ్ఞాపిక ప్రదానం చేశారు. సంతోష్‌ను ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

■ ఉత్తమ సేవా సంఘం అవార్డు

గోదావరిఖని: ఉత్తమ సేవా సంఘం జాతీయ అవార్డును ఫైట్‌ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు దినేశ్ అందుకున్నారు. తిరుపతిలో ఆదివారం నిర్వహించిన 8వ దక్షిణ భారత సదస్సులో బహుజన సాహిత్య అకాడమి. . ఈ అవార్డును అందజేసింది.

■ ఉమ్మడి జిల్లా వాలీబాల్ పోటీలు నేటి నుంచి

ధర్మారం: మండలంలోని నందిమేడారంలో మంగళ, బుధవారాల్లో ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. స్థానిక నందినీ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే నాలుగు జిల్లాల్లోని వేర్వేరు మండలాలకు చెందిన 18 మంది బాలుర, 4 బాలికల జట్లు రిపోర్టు చేసినట్లు యూత్ క్లబ్ అధ్యక్షుడు మ్యాడారం వీర్‌పాల్ తెలిపారు.

■ ఆర్థిక సాయం అందజేత

మార్కండేయకాలనీ: స్థానిక ఎల్‌బీనగర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు సదయ్య ఇటీవల మృతిచెందగా.. సహచర ఉపాధ్యాయులు రూ.65 వేల సాయాన్ని వారి కుటుంబసభ్యులకు సోమవారం అందజేశారు. డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శ్యామ్, జిల్లా ఉపాధ్యక్షులు కిరణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

■ ప్రమాద బాధితుడికి..

ధర్మారం: మండలంలోని చామనపల్లికి చెందిన సుందరగిరి మల్లయ్య కుమారుడు వినయ్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్య కోసం కొలుముల దామోదర్ యాదవ్.. తన ఫౌండేషన్ తరపున రూ.10 వేలు అందించారు. ఫౌండేషన్ ఇన్‌ఛార్జి వేల్పుల నాగరాజు పాల్గొన్నారు.

■ బాధ్యతల స్వీకరణ

పెద్దపల్లి: పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శిగా కరుణకుమారి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గత నెలలో ఏవీఎన్ రాజు ఉద్యోగ విరమణ పొందడంతో వరంగల్ కేంద్ర గ్రంథాలయంలోని గ్రంథపాలకురాలిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆమెకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

కరపత్రాల ఆవిష్కరణ

పెద్దపల్లి: హైదరాబాద్‌లో ఈ నెల 9న జరిగే తెలంగాణ ప్రజాఫ్రంట్ ఆవిర్భావ ప్రచార కరపత్రాన్ని ప్రజాసంఘాల నాయకులు సోమవారం పెద్దపల్లి అమరవీరుల స్తూపం వద్ద ఆవిష్కరించారు. జిల్లా కన్వీనర్ గుమ్మడి కొమురయ్య, ప్రజా సంఘాల నాయకులు మల్లేశం, మాదన కుమారస్వామి, నారా వినోద్, బాలసాని రాజయ్య, ముడిమడుగుల మల్లన్న, ఎరుకల రాజన్న, మార్వాడి సుదర్శన్, రామిళ్ల బాపన్న, సదానందం, రవీందర్, లక్ష్మణ్‌లు పాల్గొన్నారు.



■ పారిశుద్ధ్య పనుల పరిశీలన

ముత్తారం: మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా కొనసాగుతున్నాయని ముత్తారం ఎంపీడీవో సురేశ్ అన్నారు. ఆయన సోమవారం మండల కేంద్రంలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలానుగుణంగా వచ్చే వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. అదేవిధంగా పారిశుద్ధ్య కార్మికులకు తగిన సలహాలు, సూచనలు చేశారు.

■ ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

యైటింక్లయిన్‌కాలనీ: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు తాడూరి సంపత్‌కుమార్‌ను సోమవారం కాలనీలోని పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. సంపత్ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికై ఇటీవల రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డును అందుకోగా. . పలువురు అభినందించారు.

■ పవిత్రమైనది బతుకమ్మ పండుగ

మార్కండేయకాలనీ: అతి పవిత్రమైనది బతుకమ్మ పండుగ అని అర్చక, పురోహిత సంఘం అధ్యక్షులు వెంకటేశ్వర్‌శర్మ, రామాలయం అర్చకులు మధుసూదనచార్యులు పేర్కొన్నారు. గోదావరిఖని శారదానగర్‌లోని విశ్వహిందూ పరిషత్తు కార్యాలయంలో వారు మాట్లాడారు.

■ జూలపల్లిలో ప్రజావేదిక

జూలపల్లి: జూలపల్లిలో సోమవారం ఏపీవో సదానందం ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం ప్రజావేదిక సమీక్షా సమావేశం జరిగింది. 2023-24లో గ్రామాల్లో జరిగిన పనులను డిప్యూటీ సీఈవో సంధ్యారాణి వివరించారు. అక్కడక్కడ తప్పులు జరిగాయని తెలిపారు. రూ.2,429ల రికవరీకి ఆదేశించారు. జిల్లా విజిలెన్స్ అధికారి కొమురయ్య, పంచాయతీరాజ్ ఏఈ రాజశేఖర్, ఎంపీడీవో పద్మజ, సత్యనారాయణ ఎంపీవో అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

■ ఘనంగా కల్యాణోత్సవం

సుల్తానాబాద్: సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి శ్రీవేణుగోపాలస్వామి ఆలయ చక్ర ప్రతిష్ఠాపనోత్సవంతోపాటు స్వామివారి కల్యాణోత్సవాన్ని సోమవారం భక్తులు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే విజయ రమణారావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో మాజీ సర్పంచి గర్రెపల్లి పురుషోత్తం విగ్రహాన్ని, ఆయన జ్ఞాపకార్థం గ్రామ ముఖద్వారాన్ని కుటుంబ సభ్యులు ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే ప్రారంభించారు. కుటుంబ సభ్యులను అభినందించారు.

చట్టాలపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న న్యాయమూర్తి స్వాతిగౌడ్

కమాన్‌పూర్ (సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మంథని కోర్టు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి స్వాతిగౌడ్ అన్నారు. రామగిరి మండలం బేగంపేటలో సోమవారం 'న్యాయ విజ్ఞాన సదస్సు' నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. ప్రజలందరూ చట్టాలను గౌరవించాలన్నారు. చట్టాలను ఎవరూ అతిక్రమించి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. మంథని సీఐ రాజు, రామగిరి ఎస్సై చంద్రకుమార్, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రఘోత్తంరెడ్డి, న్యాయవాది శశిభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పాలకుర్తి, న్యూస్‌టుడే: పాలకుర్తి మండలంలోని జయ్యారం జడ్పీ ఉన్నత పాఠశాలలో 2003-2004 పదో తరగతి బృందం ఆత్మీయ సమ్మేళనాన్ని సోమవారం నిర్వహించింది. నాటి గురువులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. అలనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు.


జయ్యారం జడ్పీ ఉన్నత పాఠశాల 2003-2004 పదో తరగతి బృందం

రైల్వేస్టేషన్‌కు బాంబు బెదిరింపు

పోలీసుల అదుపులో యువకుడు

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లోని వందేభారత్ రైలులో బాంబు ఉందంటూ వచ్చిన ఫోన్‌కాల్ పోలీసులను ఉరుకులు పరుగులు పెట్టించింది. తనిఖీల అనంతరం ఇదంతా బూటకమని తెలిసి ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు పేర్కొన్న వివరాల ప్రకారం.. గోదావరిఖనికి చెందిన మధుసూదన్ (26) నగరంలోని ఐటీ కంపెనీలో పనిచేస్తున్నాడు. కొండాపూర్‌లో స్నేహితులతో కలసి ఉంటున్నాడు. సోమవారం మధ్యాహ్నం ఒంటి గంటకు వందేభారత్‌లో బాంబు ఉందంటూ డయల్ 100కు సమాచారమిచ్చాడు. అప్రమత్తమైన పోలీసులు ఫోన్‌కాల్ ఆధారంగా యువకుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. గోపాలపురం ఇన్‌స్పెక్టర్ నరేశ్ అతడి నుంచి వివరాలు సేకరించారు. తాను ఐటీ కంపెనీలో పనిచేస్తున్నానని.. తన ఫోన్, ల్యాప్‌టాప్‌ను ఎవరో హ్యాక్ చేశారని వివరించాడు. పాకిస్తాన్ ఉగ్రవాదులు మాట్లాడుకున్న మాటలు విని రైల్లో బాంబు పెట్టారనే భయంతో ఫోన్ చేశానంటూ పొంతనలేని సమాధానాలు చెప్పాడు. దీంతో పోలీసులు అతడి తల్లిదండ్రులకు సమాచారం అందజేశారు. అతడి మానసిక పరిస్థితి సరిగా లేకపోవటం వల్లనే ఫోన్‌కాల్ చేసి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విద్యుత్తు తీగ చోరీ



చీమలపేటలో బాధిత రైతులు

జూలపల్లి: మండలంలోని చీమలపేట గ్రామంలో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పంట పొలాల వద్ద 20 మోటార్లకు సంబంధించిన విద్యుత్తు తీగను దొంగిలించారని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తరచూ దొంగతనాలు జరుగుతున్నాయని.. సీసీ కెమెరాలు పనిచేయడం లేదని తెలిపారు. పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

'ఉద్యోగ నియామకాల్లో అన్యాయం'

కాల్వశ్రీరాంపూర్, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ ప్రకారం ఉద్యోగ నియామకాలు చేపడతామని, కొత్త ఆర్డినెన్స్ తీసుకొచ్చి ఉద్యోగాలు భర్తీ చేస్తామని తెలిపిన కాంగ్రెస్ ప్రభుత్వం.. వర్గీకరణ అమలులో కాలయాపన చేస్తూ మాదిగలను మోసం చేస్తోందని ఎమ్మార్పీఎస్ నాయకులు అంబాల రాజేందర్ అన్నారు. కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలో సోమవారం అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఎమ్మార్పీఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఖరికి నిరసనగా ఈ నెల 9న అంబేడ్కర్ విగ్రహాల వద్ద నిరసన తెలపనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పుల్లూరి సాగర్, కొండ్ర వివేక్, పాల శంకర్, సదానందం, స్వామి తదితరులు పాల్గొన్నారు.

అడ్డంకులు అధిగమించి..
ఉన్నత కోర్సుల్లో ప్రవేశించి..



ధర్మారం మండలం నందిమేడారానికి చెందిన ఇద్దరు బాలికలు ఎంబీబీఎస్ సీట్లు సాధించి సత్తాచాటారు. మంజునాథ గ్రామైక్య సంఘం వీవోఏ మిట్ట సంధ్య కూతురు సిరివెన్నెల, అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు సాన రజిత కూతురు శ్రీహిత నీట్‌లో ప్రతిభచాటి ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ప్రవేశానికి ఎంపికయ్యారు. గ్రామీణ, పేదరిక నేపథ్య కుటుంబాలకు చెందిన వీరిద్దరూ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో.. క్రమశిక్షణతో చదివి లక్ష్యాన్ని సాధించారు.

న్యూస్‌టుడే, ధర్మారం

తండ్రిలేని బాధను దిగమింగుకొని..



సిరివెన్నెల చిన్నతనంలోనే తండ్రి శ్రీనివాస్ అనారోగ్యం కారణంగా మృతిచెందారు. తల్లి సంధ్య సెర్ప్‌లో వీవోఏగా పనిచేస్తున్నారు. తండ్రి లేని లోటు తెలియకుండా కుమార్తెను చదివించారు సంధ్య. చిన్నప్పట్నుంచి కుటుంబ పరిస్థితులను అర్థం చేసుకున్న సిరివెన్నెల చదువుపైనే దృష్టిసారించింది. ధర్మారంలోని బ్రిలియంట్ పాఠశాలలో పదో తరగతి వరకు చదివి పది జీపీఏ సాధించి. . కరీంనగర్‌లోని శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్ చదివి 984 మార్కులతో సత్తాచాటారు. నీట్‌లో రాష్ట్ర స్థాయి 3,213 ర్యాంకు సాధించి వికారాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రవేశానికి ఎంపికయ్యారు.

గురుకులంలో చదివి..



నందిమేడారంలోని నల్లలింగయ్యపల్లికి చెందిన సాన శ్రీహిత.. తల్లి రజిత (అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు) తండ్రి రాజేందర్ (ఎల్‌ఐసీ ఏజెంట్)లతోపాటు ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో చదువులో రాణిస్తున్నారు. నాలుగో తరగతి వరకు ధర్మారంలో చదువుకున్న ఆమె.. చింతకుంటలోని సాంఘిక సంక్షేమ గురుకులంలో పది జీపీఏతో పదో తరగతి పూర్తి చేశారు. నిజామాబాద్‌లో బైపీసీ చదివి.. 977 మార్కులు సాధించారు. నీట్‌లో రాష్ట్ర స్థాయి 3,145వ ర్యాంకు సాధించి నిర్మల్ ప్రభుత్వ వైద్యకళాశాలలో ఎంబీబీఎస్‌లో ప్రవేశానికి ఎంపికయ్యారు.

రైతేరాజు

వేరుసెనగ సాగుకు వేళాయే..



వేరుసెనగ పంట



జె.విజయ్, శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, జమ్మికుంట

న్యూస్‌టుడే, జమ్మికుంట

వేరుసెనగ సాగులో రైతులు మొదటి నుంచే జాగ్రత్తలు పాటిస్తే మంచి ఫలితాలు ఉంటాయని జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం సేద్య విభాగం శాస్త్రవేత్త జె.విజయ్ తెలిపారు. ఉత్తర తెలంగాణలో అక్టోబర్ రెండో పక్షంలో విత్తుకోవచ్చని పేర్కొన్నారు. వేరుసెనగ సాగుకు సంబంధించి పాటించాల్సిన పలు అంశాలను ఆయన ఈ మేరకు వివరించారు.

అనువైన నేలలు: ఇసుకతో కూడిన గరక నేలలు లేదా త్వరితంగా నీరు ఇంకే ఎర్రనేలలు వేరుసెనగ సాగుకు అనువైనవి.

విత్తనాల ఎంపిక, మోతాదు: యాసంగిలో నీటివసతి ఉండే ప్రాంతాల్లో కదరి-6, కదరి-9, టీఏజీ-24, హరితాంధ్ర, ఐసీజీఎస్-91114, టీసీజీఎస్-1694 (విశిష్ట), ధరణి మేలైన రకాలు. గింజ బరువు, విత్తే సమయాన్ని బట్టి విత్తిన మోతాదు మారుతుంది. యాసంగిలో ఎకరానికి 60-80 కిలోల విత్తనం సరిపోతుంది.

విత్తనశుద్ధి: కిలో విత్తనానికి 1 గ్రాము టెబ్యుకొనజోల్ లేదా 3 గ్రాముల మాంకోజెబ్ పొడి మందు పట్టించాలి. కాండం కుళ్లు వైరస్ తెగుళ్లు వ్యాపించే ప్రాంతాల్లో 2 మి.లీ.ఇమిడ్క్లోప్రిడ్‌ను 7 మి.లీ. నీటిలో కలిపి కిలో విత్తనానికి పట్టించాలి.

విత్తే దూరం: సాళ్ల మధ్య దూరం 22.5 సెం.మీ., మొక్కల మధ్య 10 సెం.మీ. దూరం ఉండేలా విత్తుకోవాలి.

ఎరువుల యాజమాన్యం: ఎకరానికి 100 కిలోల సూపర్ ఫాస్ఫేట్, 33 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్, 18 కిలోల యూరియాను విత్తే సమయంలో వేయాలి. విత్తిన 30 రోజుల తర్వాత తొలిపూత దశలో మరోసారి 10 నుంచి 15 కిలోల యూరియాను వేయాలి.

■ ఎకరానికి 200 కిలోల జిప్సమ్‌ను పూత పూర్తయ్యి ఊడలు దిగే సమయంలో మొదళ్ల దగ్గర వేసి మట్టిని ఎగదోయాలి. విత్తన 45 రోజుల తర్వాత ఎలాంటి అంతర సేద్యాన్ని చేపట్టవద్దు.

కలుపు నివారణ: కలుపు మొలకెత్తక ముందు పెండిమిథాలిన్ 30% ఇ.సి. ఎకరానికి 1.30 నుంచి 1.60 లీ. వంతున 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి. విత్తన 20 రోజుల వరకు కలుపు తీసేందుకు వీలుకాని పరిస్థితుల్లో కలుపు 2-3 ఆకుల దశలో ఉన్నప్పుడు ఇమాజితాపైర్ 10% మందు 300 మి.లీ.లను ఎకరానికి 200 లీటర్ల నీటితో కలిపి విత్తిన వెంటనే లేదా 20-30 రోజుల్లో పిచికారీ చేస్తే అన్ని రకాల కలుపును నివారించవచ్చు.

నీటి యాజమాన్యం: యాసంగిలో వేరుసెనగ సాగుకు తేలిక నేలలో 6 నుంచి 8 తడులు ఇవ్వాలి. పైరులో ఊడలు దిగే దశ నుంచి కాయలు ఊరే దాకా (విత్తిన 45-50 రోజుల నుంచి 85-90 రోజుల వరకు) నీరును తగిన మోతాదులో కట్టాలి.

పంట కోతను గుర్తించటం: వేరుసెనగలో 75 శాతం కాయలు పూర్తిగా పక్వానికి వచ్చినప్పుడే కోయాలి. కాయల్లోని భాగం ముదురు గోధుమ రంగులోకి మారినప్పుడు కోతకు వచ్చిందని గుర్తించాలి.

దిగుబడులపై పోషకాల ప్రభావం

మీకు తెలుసా?

అన్నిరకాల పంటల్లోనూ అధిక వర్షం, బెట్ట, చలి, ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గులు, గాలిలో తేమ, నేలతీరును బట్టి పోషకలోపాలు తలెత్తి మొక్కల ఎదుగుదల దిగుబడులను, ఉత్పత్తుల నాణ్యతను ప్రభావితం చేస్తాయి. నత్రజని, భాస్వరాన్ని అధికంగా, పొటాష్‌ను పరిమితంగా వాడుతున్నారు. వీటితోపాటు ఉపపోషకాలైన మెగ్నీషియం, కాల్షియం, గంధకం, సూక్ష్మపోషకాలైన జింకు, కాపర్, ఐరన్, మాంగనీసు, బోరాన్, మాలిబ్డినం, క్లోరిన్ తదితరాలు పంటలకు అవసరం ఉంటాయి. పైర్లపై తలెత్తే ఈ పోషక లోపాలను సకాలంలో గుర్తించి సరిదిద్దాలి.

- న్యూస్‌టుడే, జగిత్యాల వ్యవసాయం

రైతు ప్రశ్న శాస్త్రవేత్త సమాధానం

రైతుల సందేహాలను పొలాస పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.బలరాం నివృత్తి చేశారు.

? వరిలో కంకినల్లిని ఎలా అరికట్టాలి - రాజమల్లయ్య, కండ్లపల్లి

✓ డైకోఫాల్ 5.0 మి.లీ. లేదా స్పైరోమెసిఫెన్ 1.0 మి.లీ., ప్రొపికొనజోల్ 1.0 మి.లీ.మందును ఒక లీటరు నీటికి వంతున కలిపి అవసరం మేరకు వారం, పది రోజుల వ్యవధితో రెండు సార్లు పైరుపై పిచికారీ చేయాలి.

భూమి తక్కువ.. లాభాలు ఎక్కువ

న్యూస్‌టుడే, సారంగాపూర్

ఉన్న కొద్దిపాటి భూమితో లాభాలు ఆర్జిస్తున్నారు సారంగాపూర్ మండలంలోని పోచంపేట రైతులు. ఎప్పుడు ఏదో కూరగాయ పంటను సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.



బెండ తోటలో రైతు నారాయణ

విభిన్న పంటలు

గడప నారాయణకు రెండెకరాల భూమి ఉంది. ప్రస్తుతం 4 గుంటల్లో బెండ, అయిదు గుంటల్లో చిక్కుడు, నాలుగు గుంటల్లో మిరప సాగు చేపట్టారు. ఇప్పటికే బెండతో లాభాలు పొందుతున్నారు. విత్తనాలకు రూ.1,600, సేంద్రియ ఎరువుకు రూ.6 వేలు, ఇతరత్రా రూ.5 వేల పెట్టుబడి పెట్టారు. బెండకాయల విక్రయం ద్వారా రోజుకు రూ.300ల చొప్పున దాదాపు 90 రోజులు విక్రయించి రూ.25 వేలకు పైగా ఆదాయం పొందినట్లు తెలిపారు. త్వరలోనే చిక్కుడు దిగుబడి అందుబాటులోకి రానుందని.. దీని ద్వారా రోజు రూ.500ల చొప్పున కనీసం మూడు నెలల పాటు ఆదాయం రానుందని తెలిపారు. పంట చుట్టూ తీగజాతి అయిన సొరను సాగు చేశామని.. మరో 10 గుంటల్లో టమాట సాగుకు సిద్ధం చేసినట్లు నారాయణ వివరించారు.

రూ.లక్ష ఆదాయం

గ్రామానికి చెందిన గడప సత్తన్న 10 గుంటల విస్తీర్ణంలో బెండ సాగు చేశారు. విత్తనాల కోసం రూ.2,500 వ్యయం చేయగా, ఇతర ఖర్చుల కింద రూ.2 వేలు పెట్టుబడి పెట్టారు. 45 రోజులకు బెండ కాతకు వచ్చింది. మూడు నెలల పాటు రోజుకు రూ.1,000 నుంచి రూ.1500ల వరకు ఆదాయం వచ్చినట్లు సత్తన్న పేర్కొన్నారు. మొక్కజొన్న సాగు చేసి అంతర పంటగా ఏడు గుంటల విస్తీర్ణంలో చిక్కుడు సాగు చేయగా ప్రస్తుతం కాత దశకు చేరుకుంది. తక్కువ విస్తీర్ణంలో ఏదోరకం కూరగాయల పంట సాగు చేపడితే రోజూ చేతిలో డబ్బులు ఉంటాయని ఈ రైతులు వెల్లడించారు.

విదేశాలకు స్వదేశీ రుచులు!

సులభంగా తినుబండారాలు, వస్తువుల బట్వాడా ■ విస్తరిస్తున్న కొరియర్ సంస్థలు



విద్య, ఉద్యోగం, ఉపాధి, వ్యాపారం నిమిత్తం ఏటా ఉమ్మడి జిల్లా నుంచి విదేశాలకు వెళ్లే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఇప్పటికే అమెరికా, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్‌లాంటి దేశాల్లో స్థిరపడిన ఇక్కడి కుటుంబాలు చాలానే ఉన్నాయి. ఈక్రమంలో ఇక్కడి తినుబండారాలు, పచ్చళ్లకు విదేశాల్లో గిరాకీ ఏర్పడింది. అక్కడి ఆహార పదార్థాలు నచ్చక, చేసుకోవడానికి సమయం లేక, ఆరోగ్యం తదితర కారణాలతో ఇక్కడి నుంచి బట్వాడా చేసుకొంటున్నారు. మందులు, వంట సామగ్రి, పప్పులనూ ఇక్కడి నుంచి ఇతర దేశాలకు పంపిస్తుండటంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేంద్రంలో కొరియర్ సంస్థలు పెరిగాయి.

– న్యూస్‌టుడే, తెలంగాణచౌక్ (కరీంనగర్)



తినుబండారాలే అధికం..

అమెరికా, ఇంగ్లాండ్‌లాంటి దేశాల్లో భార్యాభర్తలు ఉద్యోగం చేస్తేనే కుటుంబ పోషణతో పాటు డబ్బు పొదుపు చేసుకోవడానికి వీలుంటుంది. విధులు నిర్వర్తించడం, ఖాళీ సమయం ఎక్కువ ఉండకపోవడంతో, ఆరోగ్యం, రుచులపరంగా ఇంటి నుంచి తెప్పించుకోవడానికి ఎక్కువగా ప్రాధాన్యమిస్తున్నారు. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల సాయంతో లేదా కొరియర్ ద్వారా తెప్పించుకుంటున్నారు. దీనికి అనుగుణంగా కొరియర్ సంస్థలు ఫెడెక్స్, యూపీఎస్, డీహెచ్ఎల్, ఇతర సంస్థలతో అవగాహన ఒప్పందం కుదుర్చుకొని పార్సిళ్లను పంపిస్తున్నాయి. ఎక్కువగా పచ్చళ్లు, మిఠాయిలు, పిండి పదార్థాలు, మందులు(మెడిసిన్స్) విదేశాలకు కొరియర్ చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

రూ.కోట్లలో వ్యాపారం

కిలో పార్సిల్‌కు రూ.2800, 10 కిలోల పైన ఉంటే కిలోకు రూ.660-700 చొప్పున, మందులకు అయితే రూ.3400(500 గ్రాములు) తీసుకుంటున్నారు. విదేశాలకు కొరియర్లు పంపించే వ్యాపారం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఏటా రూ.2 కోట్లపైగా జరుగుతుందని చెప్పారు. దసరా, సంక్రాంతి, పచ్చళ్ల సీజన్లలో గిరాకీ అధికంగా ఉంటుందన్నారు. కరీంనగర్‌లో విదేశాలకు పంపే ప్రధాన కొరియర్ సంస్థలు అయిదు ఉన్నాయి.

సీజన్‌లో అధికంగా..

ఎక్కువగా అమెరికాకు పార్శిళ్లు వెళ్తుంటాయి. రోజువారీగా కొరియర్లు తక్కువగానే ఉన్నా సంక్రాంతి, దసరా పండుగలప్పుడు ఎక్కువగా ఉంటాయి. వినియోగదారుడు పార్సిల్ బుక్ చేసుకున్న తర్వాత అతనికి లింక్ పంపిస్తాం. దాని ద్వారా పార్సిల్ ఎక్కడ ఉంది. డెలివరీ అయిందా? అనే వివరాలు తెలుసుకోవచ్చు. మేము 100కు పైగా దేశాలకు వస్తువులు పంపుతుంటాం.

– గడ్డం విలాస్‌రెడ్డి, కొరియర్ సంస్థ నిర్వాహకుడు



కొరియర్ సంస్థలో పార్సిళ్లను సీల్ చేస్తూ..

వందకుపైగా దేశాలకు..

■ కరీంనగర్ నుంచి అమెరికా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, జర్మనీ, కెనడా, సింగపూర్, మలేషియా తదితర 100 దేశాలకు పార్సిళ్లను పంపించే వెసులుబాటును కొరియర్ సంస్థలు అందిస్తున్నాయి.

■ మందులు పంపితే వైద్యుడి ప్రిస్క్రిప్షన్, ఆధార్, చరవాణి నంబరు, స్వీకరించే వ్యక్తికి సంబంధించిన పాస్‌పోర్టు జిరాక్స్ ప్రతులు, చిరునామా తప్పనిసరిగా జత చేయాలి.

■ ప్రతి రోజు కరీంనగర్ నుంచి 15 నుంచి 20 వరకు, నెలకు దాదాపు 500కుపైగా.. పండుగల(సంక్రాంతి, దసరా) సీజన్లలో అయితే రోజుకు 200 నుంచి 300 వరకు, నెలకు 3 వేలకు పైగా విదేశాలకు పార్శిళ్లు వెళ్తుంటాయని నిర్వాహకులు తెలిపారు. జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల నుంచి గల్ఫ్ వెళ్లే వారి సంఖ్య ఎక్కువగా ఉండటంతో వారు కరీంనగర్ వచ్చి కొరియర్ చేస్తారు.

■ పార్శిళ్లల్లో 80 శాతం అమెరికాకే బుక్ అవుతుండగా యూకే(10 శాతం), ఆస్ట్రేలియా, సింగపూర్, గల్ఫ్ తదితర దేశాలకు మరో పది శాతం వెళ్తున్నట్లు ఓ కొరియర్ నిర్వాహకుడు పేర్కొన్నారు.

■ సోమవారం పార్శిళ్లు బుకింగ్ చేస్తే.. ఆ దేశాలకు శుక్రవారం చేరే అవకాశముంది. శని, ఆదివారం సెలవు కావడంతో వాటిని తీసుకోవడానికి ఇంటి వద్ద ఉంటారనే ఉద్దేశంతో సోమవారం ఎక్కువ బుక్ చేస్తున్నారు.

■ బంగారం, వెండి, కొబ్బరి(కుడుకలు), కొబ్బరి పొడి, నూనెలు, బ్లేడ్లు, పిన్నీసులు, పిన్నులు, కరివేపాకు, మండే స్వభావం కలిగిన వస్తువులు కొరియర్ చేయడానికి వీల్లేదు.


కారు కొనటానికి తండ్రి నిరాకరణ.. తనయుడి బలవన్మరణం

జమ్మికుంట, న్యూస్‌టుడే: దళిత బంధు నిధులతో కొన్న ట్రాక్టర్ విక్రయించి కారు కొనాలని అడగ్గా తండ్రి నిరాకరించడంతో తనయుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన జమ్మికుంట మండలం పాపయ్యపల్లిలో జరిగింది. సీఐ రవి, గ్రామస్థుల కథనం మేరకు.. పాపయ్యపల్లికి చెందిన శనిగరపు భద్రయ్య గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. దళిత బంధు పథకం యూనిట్ కింద ట్రాక్టర్ తీసుకున్నాడు. ట్రాక్టర్‌ను విక్రయించి కారు కొనాలని ఆదివారం భద్రయ్యను అతని కుమారుడు మహేందర్(22) అడగ్గా నిరాకరించాడు. దీంతో మహేందర్ పురుగు మందు తాగాడు. వెంటనే వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో రాత్రి మృతి చెందాడు. సోమవారం మృతుడి భద్రయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.



మహేందర్

బతుకమ్మ పూలకు వెళ్లి.. బావిలో పడి మృత్యువాత



కాళిదాసు

గన్నేరువరం, న్యూస్‌టుడే: బతుకమ్మ పండగ సమీపిస్తున్న క్రమంలో పూల కోసం వెళ్లి ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన గన్నేరువరం మండలం జంగపల్లిలో జరిగింది. పోలీసులు, బాధిత కుటుంబసభ్యుల కథనం మేరకు.. జంగపల్లికి చెందిన గుంటుక కాళిదాసు(40) ఆదివారం బతుకమ్మ పూల కోసమని బయటకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. సోమవారం ఉదయం కాళిదాసు మృతదేహం గ్రామంలోని ఓ వ్యవసాయ బావిలో తేలడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని ఎస్సై నరేష్ దర్యాప్తు చేపట్టారు.

పొదుపు సంఘాల్లో పేరుకుపోతున్న మొండి బకాయిలు

● అప్పులు చెల్లించని సంఘాలపై దృష్టి

● మనుగడలోకి తీసుకొచ్చేందుకు ప్రణాళిక

న్యూస్‌టుడే, పెద్దపల్లి కలెక్టరేట్:

స్వయం సహాయక సంఘాల్లో మొండి బకాయిలు పేరుకుపోతున్నాయి. అప్పులు చెల్లించడంలో కొందరు మహిళా సంఘాల సభ్యులు ఏళ్ల తరబడి ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. దీంతో లావాదేవీలు నిలిచిపోవడంతో సంఘాల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది. ఈ క్రమంలో ఆర్థిక స్వావలంబనపై ప్రభావం చూపుతున్న బకాయిల వసూళ్లపై గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ప్రత్యేక దృష్టి సారించింది. గ్రామాల వారీగా సంఘాల జాబితా రూపొందించి.. క్షేత్ర స్థాయిలో వాటికి గల కారణాలను అన్వేషిస్తున్నారు. సభ్యులను సంఘటితం చేసి కిస్తీలు చెల్లింపుతో పాటు పొదుపు బాట పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారు.



ఎలిగేడు మండలం దూళికట్టలో మహిళలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఉమ్మడి జిల్లాలో మహిళ సంఘాల మొండి బకాయిల వివరాలు

	సంఘాలు	సొమ్ము(రూ.కోట్లలో)
పెద్దపల్లి	460	12.95
జగిత్యాల	247	6.07
కరీంనగర్	231	7.48
రాజన్నసిరిసిల్ల	93	2.96

ప్రత్యేక ప్రణాళిక రూపొందించాం

- రవీందర్ రాథోడ్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, పెద్దపల్లి

జిల్లాలో మొండి బకాయిల వసూళ్లపై ప్రణాళిక రూపొందించాం. సీసీల నుంచి డీపీఎంల వరకు మహిళలతో సమావేశమవుతున్నారు. వాస్తవ పరిస్థితులు తెలుసుకుంటున్నారు. మహిళ సంఘాలను పొదుపు మార్గంలోకి తీసుకోస్తాం.

ఉమ్మడి జిల్లాలో రూ.29.46 కోట్లు

పొదుపు అర్హత బట్టీ ప్రతి సంఘానికి రూ.10 లక్షల వరకు రుణాలు బ్యాంకులు మంజూరు చేస్తున్నాయి. అయితే రుణాలు పొందిన కొందరు మహిళలు తిరిగి కిస్తీలు చెల్లించడం లేదు. వలస వెళ్లడం, మృతి చెందడం, నిర్ణీత 65 ఏళ్ల వయసు నిండటం తదితర కారణాలతో బకాయిలు పేరుకుపోతున్నాయి. మహిళల ఉపాధితో పాటు ఇతర అవసరాలకు తీసుకున్న రుణాల వడ్డీ, అసలు చెల్లించకపోవడంతో లావాదేవీలు నిలిచిపోతున్నాయి. గ్రామాఖ్య సంఘాల సహకారంతో అప్పులు చెల్లించని మహిళల్లో చైతన్యం కల్పిస్తున్నారు. కొన్ని చోట్ల వారు ముందు కొచ్చినప్పటికి మరికొన్ని చోట్ల ఆశించిన స్థాయిలో స్పందన లభించడం లేదు. ఒక సంఘంలో ఇద్దరు బకాయిదారులు ఉంటే వారి సొమ్ము తామెలా చెల్లిస్తామంటూ అధికారులను ప్రశ్నిస్తున్నారు. దీంతో సంఘాల మనుగడ కష్టంగా మారే ప్రమాదం ఉండటంతో అధికారులు సంఘంలోని సభ్యులందరినీ సమన్వయం చేస్తూ తిరిగి గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 49,544 స్వశక్తి సంఘాల్లో 5,48,091 మంది సభ్యులు ఉన్నారు. 1,031 సంఘాల్లో రూ.29.46 కోట్ల మొండి బకాయిలు ఉన్నాయి.

గుడి, బడిని సందర్శించిన సుప్రీంకోర్టు న్యాయమూర్తి



కోదండరామ ఆలయం వద్ద సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్‌కుమార్ తదితరులు

కోనరావుపేట, న్యూస్‌టుడే: కోనరావుపేట మండలం మల్కపేటలో మాజీ మంత్రి చల్మెడ ఆనందరావు తన సొంత డబ్బులు రూ.6 కోట్లు పైగా వెచ్చించి నిర్మించిన పాఠశాల భవనాన్ని సోమవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్‌కుమార్ సందర్శించారు. విద్యార్థులకు కార్పొరేట్ విద్య అందించేందుకు వీలుగా నిర్మించడం అభినందనీయమన్నారు. అనంతరం కాళేశ్వరం ఎత్తిపోతలు ప్యాకేజీ-9 రిజర్వాయర్ కట్టను ఆనుకుని బొల్లి గుట్టపై నిర్మించిన శ్రీకోదండరామస్వామి ఆలయాన్ని సందర్శించారు. పాఠశాల, ఆలయ నిర్మాణాలకు సంబంధించిన వివరాలను మాజీ మంత్రి కుమారుడు మధుసూదన్‌రావును అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట న్యాయవాదులు రామారావు, శ్రీధర్‌రెడ్డి, గ్రామ నాయకుడు ఆరె మహేందర్ తదితరులు ఉన్నారు.

డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్ష ఫలితాల విడుదల

కరీంనగర్ కలెక్టరేట్ : శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో గత సెప్టెంబరులో నిర్వహించిన డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్ష ఫలితాలు విడుదల చేసినట్లు ఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డా.శ్రీరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాలు వెబ్‌సైట్ www.satavahana.ac.in లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

చదువుతున్నారా.. బడి మానేశారా?

పాఠశాలల్లో తేలని విద్యార్థుల లెక్క

జిల్లాల వారీగా విద్యార్థుల సంఖ్య

జిల్లా	సంఖ్య
పెద్దపల్లి	7,498
కరీంనగర్	12,952
జగిత్యాల	5,285
రాజన్న సిరిసిల్ల	4,400

న్యూస్‌టుడే, పెద్దపల్లి కలెక్టరేట్

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తేల్చలేక విద్యాశాఖ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఈ ఏడాది ప్రవేశాల గడువు ముగిసినప్పటికి తుది జాబితా కొలిక్కిరాలేదు. పిల్లలు చదువుతున్నారా? బడి మానేశారా? అనే ప్రశ్నలకు పొంతన కుదరడం లేదు.



పెద్దపల్లిలో మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థులు

ఎందుకింత నిర్లక్ష్యం

■ కేంద్ర ప్రభుత్వం ఒకటి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థుల సంఖ్య కోసం 2012-13లో యూడైస్ పోర్టల్ (ఏకీకృత జిల్లా విద్యా సమాచారం) తెచ్చింది. రెండేళ్ల కిందట దీన్ని యూడైస్ ప్లస్‌గా మార్చారు.

■ ఏటా విద్యార్థుల సమగ్ర వివరాలు పొందుపరుస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 30,135 మంది పిల్లల సమాచారం లేదు.

■ బడి ఈడు పిల్లలు చదువుతున్నారా? బడి బయట ఉన్నారనే విషయం తేల్చేందుకు యూడైస్ ప్లస్ నివేదిక తేల్చుతుంది. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ఈ నివేదిక కొలమానం కానుంది.

■ ప్రవేశం పొందిన విద్యార్థి ఆధార్ అనుసంధానిస్తున్నారు. దీంతో ఒక విద్యార్థి పేరు రెండు చోట్ల ఉండే అవకాశం లేదు. ■ వివరాలు నమోదు చేయడంలో ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. పోర్టల్‌లో నమోదు కాని విద్యార్థుల వివరాలపై ఉన్నతాధికారులు ఆదేశించినప్పటికీ ఫలితం లేదు.

నెలల తరబడి హాజరు కాకున్నా..

బడుల్లో బోగస్ సంఖ్య తప్పించుకునేందుకు ఎత్తుగడ వేస్తున్నారు. కొందరికి ఆధార్ వేలిముద్రలు పడటంలేదని.. మరికొందరు ఉపాధి కోసం వలస వెళ్లి మళ్లీ ఇక్కడినే చదువుకుంటారని.. ఆధార్ నవీకరణలో సాంకేతిక సమస్యలు ఉన్నాయని.. ఇలా కుంటిసాకులు చెబుతున్నారు. కొన్ని చోట్ల నెలల తరబడి పిల్లలు హాజరు కాకున్నా వారి రిజిస్టర్‌లో నమోదవుతున్నాయి. పిల్లల సంఖ్య తగ్గితే అక్కడ నుంచి బదిలీ లేదా డిప్యుటేషన్‌పై పంపిస్తారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. విద్యాశాఖ అధికారులు దృష్టి సారిస్తే బోగస్ సంఖ్య తేలనుంది.

బోగస్ లెక్కలేనా?

పాఠశాలల్లో చేరిన ప్రతి విద్యార్థికి శాశ్వత విద్యా సంఖ్య (పర్మనెంట్ ఎడ్యుకేషనల్ నంబర్) కేటాయించి పోర్టల్‌లో నమోదు చేస్తారు. ఒక పాఠశాల నుంచి మరో బడికి మారినా, టీసీ తీసుకుని వెళ్లినా యూడైస్‌లోని డ్రాప్ బాక్స్‌లో వేస్తారు. ఈ శాశ్వత సంఖ్య ఆధారంగా ప్రవేశం కల్పిస్తే ఎక్కడ చదువుతున్నారో తెలుస్తుంది. ఒక వేళ బోగస్ పిల్లల నమోదు చేసినా వేరే చోట చేరకపోయినా డ్రాప్‌బాక్స్‌లో సంఖ్య కనిపిస్తుంది. విద్యార్థుల వివరాలు లేనివారివే డ్రాప్‌బాక్స్‌లో ఉంటాయి. ఈ లెక్కన ఉమ్మడి జిల్లాలో 30,135 మంది పిల్లల సమాచారం తేలాల్సి ఉంది. వాస్తవంగా వీరంతా చదువుతున్నారా లేదో అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రత్యేక కార్యాచరణ

ప్రతి విద్యార్థిని పోర్టల్ నమోదు చేస్తున్నాం. జిల్లాలో డ్రాప్ బాక్స్‌లో ఉన్న వివరాలను తొలగించేందుకు కార్యాచరణ అమలు చేస్తున్నాం. తమ పరిధిలోని సంఖ్యను తేల్చాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశిస్తున్నాం. నిర్లక్ష్యం చేసిన యాజమాన్యాలపై కఠినంగా వ్యవహరిస్తున్నాం.

- మాధవి, జిల్లా విద్యాధికారి